సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం,23 మార్చి 2025



## ఎమ్మెల్యే రాజప్ప చేతుల మీద సీఎం రిలీఫ్ చెక్కులు అందజేత



2లో..

### స్వామి నీ దర్శన

# భాగ్యమేల



- వాడపల్లికి పోటెత్తిన భక్తజనం - స్పృహ తప్పి పడిపోయిన భక్తులు
- మాడవీధుల్లో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులకు దుకాణాలు దర్శనం
- నచ్చిన వాళ్లకే అంతరాలయ దర్శనం







**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయానికి శనివారం అధిక సంఖ్య లో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో నిండి పోయాయి. శనివారం వచ్చిందంటే 50 నుండి 60 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. సామాన్య భక్తులు స్వామివారి దర్శనం చేసుకోవాలంటే ప్రయాసపడవలసిందే. రోజురోజుకీ వీఐపీల సంఖ్య పెరగడంతో వారి దర్శనానికి ప్రాధాన్యమిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతరాలయ దర్శనం లేకపోయినా నచ్చినవాళ్లకు అంతరాలయ దర్శనం కల్పించడం ఎంతవరకు సబబు అని భక్తులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. ఆదాయం మీద చూపుతున్న శ్రద్ధ భక్తుల సౌకర్యాలు కల్పించడంలో చూపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. స్వామివారి దర్శనానికి ఆరు గంటల సమయం పైనే పడుతుంది. ఏడు ప్రదర్శనలు చేసే మాడవీధుల్లో

- తరువాయి 2లో..

### జల భద్రతతోనే...

# భవిత సురక్షితం

- జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



అమలాపురం,మేజర్‌న్యూస్:మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారమని,జల భద్రతతోనే భవిత సురక్షితమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పేర్కొన్నారు.ప్రపంచ జల దినోత్సవాన్ని నాబార్డ్ కోనసీమ జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ నందు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జల సంరక్షణపై దిశా నిర్దేశం చేస్తూ భవిష్య త్తులోఎదుర్కొనబోయే నీటి యాజమాన్య సవాళ్ళను గురించి ప్రస్తావించి, తదనుగుణంగా శాస్త్రవేత్తలు, అధికారులు మరియు సంబంధిత సంస్థలు సంయుక్త ప్రణాళికలు రచించుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నీటి ప్రాముఖ్యత, సరఫరా, పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేసుకోవడం దీని ముఖ్య

- తరువాయి 2లో..

### వర్షపు నీటిని నిలుపుదాం..

# కరువును గెలుద్దాం..

- జాతీయ ఉపాధి హామీ పథకంలో రైతుల ఆధ్వర్యంలో నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం సహకారం అందిస్తోంది
- ఆరుగాలం శ్రమించే అన్నదాతల్లో ఆనందంకోసం కూటమి ప్రభుత్వం కృషిచేస్తుంది
- నీటి కుంట కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి
- ఫామ్ ఫాండ్ నిర్మించుకుందాం
- వర్షపు నీటిని సంరక్షించుకుందాం
- అధిక పంట దిగుబడులు పొందుదాం
- తోకాడ గ్రామంలో పంట సంజీవిని
- ఫామ్ పాండ్స్ కార్యక్రమంలో పాల్గొన్న..
- మంత్రి కందుల దుర్గేష్
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి
- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



**రాజానగరం,మేజర్‌న్యూస్ :** సేద్యానికి నీటిని నిల్వ చేయడానికి, ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసుకుని పొలాలకు అందించడానికి నీటి కుంటలు చాలా అవసరమని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం రాజానగరం మండలం తోకాడ గ్రామంలో మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎమ్మెల్యే బత్తుల

- తరువాయి 2లో..

### ఆదరణ-3 పథకంతో

# మెరుగైన జీవనోపాధి

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ-3 పథకం ద్వారా ఆధునిక పరికరాలు, పనిముట్లు అందించి బీసీ కుల వృత్తికారులకు మెరుగైన జీవనోపాదులను కల్పించనుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సత్యన్నారాయణ తెలియజేశారు.శనివారం మద్యాహ్నం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో రాష్ట్ర బిసిసంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సత్యన్నారాయణ, బిసి కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా కలెక్టర్ షాన్మోహన్ సగిలి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వం కార్యదర్శి ఎస్.సత్యన్నారాయణ మాట్లాడుతూ బిసి కులవృత్తుల ప్రోత్సాహనికి రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలు నిదులు కేటాయించి ఆదరణ-3 పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తోందని తెలియ జేశారు. ఇందులో బాగంగా వృత్తి పనులలో వచ్చిన ఆధునిక సాంకేతికను బీసీ వృత్తికారులకు అందించి



వారిని ఆర్థికబలోపేతం చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించేందుకు ఆయాకుల వృత్తికారుల ప్రతినిధులతే చర్చించి,వారి సలహాలు సూచనలను సేకరించేందుకు ఆయా వృత్తుల సంఘాలప్రతినిధులతో తొలివర్కుషాపును కాకినాడలో శనివారం ఉదయం నిర్వహించామని తెలిపారు. ఈ వర్కుషాపులో 26 వృత్తి సంఘాల నాయకులు పాల్గొని కాలానుగుణంగా వృత్తులలో

- తరువాయి 2లో..

# జల భద్రతతోనే...భవిత సురక్షితం

మొదటిపేజీ తరువాయి

ఉద్దేశ్యమన్నారు. భవి ష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాల నేది ప్రధాన లక్ష్యమన్నారు. నీటి వనరుల లభ్యత సుస్థిరంగా సాగేలా చేయడంలో హిమానీనదాలదే కీలక పాత్రని, అయితే భూతాపం హిమానీ నదాల వేగంగా కరగడంతో జల భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయని అధ్యయనాలు సూచిస్తున్నాయన్నారు. పరిశ్రమల కర్బన ఉద్గారాలు, వృక్ష సంపద నష్టం, సహజ వనరుల అధిక వినియోగం వంటి మానవ కార్యకలాపాల పెరుగుదలతో హిమాలయ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయన్నారు. ఉష్ణోగ్రతలు పెరిగి సరస్సుల విస్ఫోటనం సంభవించి వరదలు రావడం, కొండ చరియలు విరిగిపడటం వంటి విపత్తులకు దారితీస్తోందన్నారు. దానివల్ల దిగువ ప్రాంతాల్లో నివసించే కోట్లమంది. దీర్ఘకాలిక సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదముందన్నారు.

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి వనరుల పరిరక్షణ అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో జాతీయ జల సంస్థకు చెందిన శాస్త్రవేత్త వై.శివ ప్రసాద్ పాల్గొని తమ పరిశోధనా అంశాలను సదస్సుకు హాజరైన వివిధ శాఖల అధికారులతో పంచుకున్నారు. కోనసీమ జిల్లా అటవీ అధికారి ఎం.వి.ప్రసాదరావు పాల్గొని ప్రసం గిస్తూ, కోనసీమ జిల్లాలో తీర ప్రాంత కోత, మడ అడవుల పరిరక్షణ, ఉప్పు నీటి ప్రవాహంతో ముప్పు తదితర అంశాలపై చర్చించారు. సముద్ర తీరం వెంబడి ఉన్న మడ అడవుల సంరక్షణ ద్వారా తీరప్రాంత ప్రజానీకం సంరక్షింపబడుతున్నారని అదేవిధంగా మత్స్య సంపద అభివృద్ధి ఈ అడవులు దోహదపడుతున్నాయన్నారు. జీవవైవిధ్యం సమతుల్యత, జీవనోపాదులు పెంపుదలకు సహజ వనరుల బలోపేతానికి మడ అడవులు దోహదపడతాయన్నారు. అదే విధంగా, పరిసరాల పరిశుభ్రత అనేది ఒక సామాజిక బాధ్యతగా పాటించటం ద్వారా మాత్రమే ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించడం సాధ్యపడు తుందని సూచించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో వాతావరణంలో మార్పులు, జల వనరులపై దాని ప్రభావం సవాళ్లు ఎదుర్కొనాల్సిన అంశాలపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ జల సంస్థకు చెందిన శాస్త్రవేత్త శివప్రసాద్ పెరుగుతున్న వాతావరణ మార్పుల వలన గోదావరి డెల్టా భూగర్భ జలవనరులలో పెరుగుతున్న సాలైనిటీ మరియు ఇతర మార్పులను నిశితంగా వివరించారు. ఇంకా ఈ కార్యక్రమములో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా భూగర్భ జలవనరులు, నీటి లభ్యత సంరక్షణ అంశాలపై నీటి పారుదలశాఖ, వివిధ శాఖల అధికారులు చర్చించడంతో పాటుగా జల సంరక్షణ భవిష్యత్ తరాలకు జల సంపద అందించే అంశాల భద్రతపై ప్రసం గించారు. నాబార్డ్ డి.డి.ఎం. డాక్టర్ వై.యస్.నాయుడు తన ప్రెజెంటేషన్ ద్వారా వాతావరణ మార్పులకు సంబంధించి నాబార్డ్ ద్వారా వ్యవసాయ మరియు అనుబంధ రంగాలలో ప్రాజెక్టులు ఏర్పాటు చేయడంతో పాటుగా కాట్రేనికోన ప్రాంతంలో ఎండు చేపల తయారీ కొరకు సోలార్ డ్రైయర్స్ కొరకు నాబార్డ్ ద్వారా యూనిట్లు ప్రతిపాదించడం జరిగిందన్నారు. వాతావరణ మార్పుల చర్యలపై అవగాహన సద స్సుకు విచ్చేసిన అధికారులు, శాస్త్రవేత్తలు, ఎన్.జి.ఓ. తదితర చముదు సహజ వాయువు సంస్థల ప్రతినిధులు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో ఉమ్మడిగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం కేశవ వర్మ, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి నీ దర్శన భాగ్యమేల

మొదటిపేజీ తరువాయి

పువ్వుల దుకాణాలు, ఫోటోషాపులు ఉండడంతో భక్తులు పదరాని పాట్లు పడుతున్నారు. ఒకానొక దశలో తోపులాటలు చోటుచేసుకున్నాయి. తెల్లవారుజాము నుండి రాత్రి 9 వరకు భక్తుల రద్దీ కొనసాగింది. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు, డి.ఎస్.పి మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము పర్యవేక్షించారు. స్వామివారి ఆదాయానికి గండి స్వామివారి దర్శనం చేసుకోవాలంటే ఉచిత దర్శనం, 200 దర్శనం, 1116 దర్శనం, విఐపి దర్శనం ఏర్పాటు చేశారు. వాడపల్లి, లొల్ల, మెర్లపాలెం గ్రామస్తులకు ఇటువంటి టిక్కెట్టుతో లేకుండా విఐపి దర్శనం కల్పించడం ఏమిటని భక్తులు నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. వాడపల్లి గ్రామానికి ఉచితంగా దర్శనం కల్పించాలి. కానీ మిగతా గ్రామాలకు దర్శనాలు కల్పించడంపై మండలంలోని ప్రతి గ్రామానికి ఉచిత దర్శనం కల్పించాలని, కానీ కొన్ని గ్రామాలకి విఐపి దర్శనం కల్పించడంపై మండలంలోని గ్రామస్తులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు స్వామివారి ఏ కార్యక్రమం జరిగిన ఆ కార్యక్రమంలో పాల్గొని సేవ చేస్తుంటారు. కానీ లొల్ల, మెర్లపాలెం గ్రామ వాసులకు విఐపి ఉచిత దర్శనం కల్పించడం ఏమిటన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఆలయ ఆదాయానికి లక్షల్లోనే గండి పడుతుంది. శనివారం స్వామివారి ఆదా యం రూ. 55 లక్షలు సమకూరింది. **ఆక్రమణలతో భక్తులు ఇబ్బందులు** ..శనివారం భక్తులరద్దీతో బొబ్బర్లంక నుండి రావులపాలెం వరకు ఆర్అండ్ బి రోడ్డు నిండిపోతుంది. దీంతో భక్తులు ఇరుకు రోడ్డుతో నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు రోడ్డు ఇరువైపులా ఆక్రమి ంచి షాపులు పెట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డున భక్తులు వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని పరువులు ఆరోపిస్తున్నారు. ఎప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకుని ప్రతిష్టమైన చర్యలు తీసుకుని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

# ఎమ్మెల్యే రాజప్ప చేతులు మీద సీఎం రిలీఫ్ చెక్కులు అందజేత

మొదటిపేజీ తరువాయి

**సామర్లకోట,మేజర్న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ప్రత్యేకంగా కృషిచేస్తుందని, ప్రజలు అనారోగ్యాల పాలై ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు పెట్టిన ఖర్చులకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ప్రజల ఆరోగ్య రక్షణకు ఎంతో మేలు చేస్తుందని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట మండలం అచ్చంపేట క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం టౌన్ నాయకులు నిమ్మకాయల కిరణ్కుమార్, ముత్యం రాజుబాబుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే చినరాజప్ప చేతుల మీదుగా సీఎం రిలీఫ్ఫండ్ చెక్కును అందజేశారు. సహాయం అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

# వర్షపు నీటిని నిలుపుదాం.. కరువును గెలుద్దాం..

మొదటిపేజీ తరువాయి

బలరామకృష్ణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సేద్యపు నీటి కుంట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రైతన్నలకు రక్షణగా నిలబడాలన్న సత్సంకల్పంతో కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని అందులో భాగంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా సేద్యపు నీటి కుంట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. వర్షపు నీటి బొట్టును వడిసి పట్టి సాగునీటి ఎద్దడి నివారణ కోసం చేపట్టిన సేద్యపు కుంటలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నీటి కుంటల ఏర్పాటు ద్వారా నీటి ఎద్దడి తగ్గటంతోపాటు, అడుగంటి పోతున్న భూగర్భజలాలు సైతం బాగా పెరుగుతాయని సూచించారు. తద్వారా పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. చుట్టూ కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వర్షపు నీటిని నిల్వ చేయాలన్న విధానానికి శ్రీకారం చుడుతూ రాజానగరంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రైతులు కూడా నీటి కుంటలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. ప్రతి పొలంలో చిన్నపాటి నీటి కుంటలను నిర్మించే క్రమంలో ఏ ఫాండ్ కు ఎంత ఖర్చు అవుతుందో అంచనా వేసి మెటీరియల్ ఖర్చుతో పాటు లేబర్ ఖర్చును ప్రభుత్వం తరపున ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సహకారం అందించను న్నామన్నారు. తద్వారా పొలాలు పండించేందుకు అవసరమైన నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. అదే విధంగా పాడికి అవసరమైన నీటిని అందజేయవచ్చన్నారు. అదే విధంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్ట్ నర్ షిప్ (పీ) విధానంలో గ్రామాల్లో ఖాళీగా ఉన్న స్థలాలను ఎంపిక చేసి అక్కడ చెరువులు ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసి భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమం విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పంటకుంటలు, పంట సంజీవిని పనులను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నేడు ప్రారంభించుకుంటున్నమన్నారు. నీరు ఎక్కడ సమృద్ధిగా ఉంటుందో అక్కడ పశువులు యొక్క జీవన విధానం మెరుగ్గా ఉంటుందన్నారు. తద్వారా పంటలు బాగా పండటంతో భూమి విలువ పెరుగుతుందన్నారు. వర్షపు నీటిని విలువ చేసుకోవడం వలన భూగర్భ జలాలు అభివృద్ధి చెంది నేల సారవంతం అవడంతో పాటు పంటలు బాగా పండుతాయన్నారు. ప్రస్తుతం మార్చి నెలలోనే మనం ఎక్కువ ఉష్ణోగ్రత వలన బయటకు రాలేని పరిస్థితి కూడా ఉందన్నారు. నీరు ఆవిరిగా మారటం వలన భూగర్భ జలాలు ఎండిపోయి బోర్లు కూడా ఎక్కువ లోతు తీయవలసిన పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపెట్టి గ్రౌండ్ వాటర్ పెంచే విధంగా ఇంకుడు గుంటలను తీయవలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఫామ్ ఫాండ్స్ ను ఉచితంగా గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రైతుకు వారి పొలంలో రు. 44 వేల రూపాయలు విలువ గల ఫామ్ ఫాండ్స్ ను అందిస్తున్నామన్నారు. రైతు తన పొలానికి సంబంధించి నీటిని స్టోర్ చేసుకొని పంటలు పండించు కోవడంతో పాటు పశువుల దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ యొక్క అవకాశాన్ని సన్న చిన్న కారు రైతులందరూ కలెక్టర్ సూచించారు. పండ్ల తోటల పెంపకం రైతులు ఫామ్ ఫాండ్స్ కు మూడు సంవత్సరాల మెయింటెనెన్స్, వాటర్ సప్లై చార్జెస్ మరియు పండ్ల మొక్కలు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంది అన్నారు. రైతులందరూ ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ ఫామ్ ఫాండ్స్ కు సంబంధించి పంచాయితీ, ఇరిగేషన్, రెవెన్యూ స్థలాల్లో 20×20 విస్తీర్ణంలో ఫామ్ ఫాండ్స్ ను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని భూగర్భ జలాల లభ్యతను పెంపొందించే విధంగా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా నీటి లభ్యతను చేకూర్చే విధంగా పంట సంజీవని ఇంకుడు గుంటల కార్యక్రమాన్ని చేపట్టిందని ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుధూర ప్రాంతాల నుండి తమ పశువులకు, మొక్కలకు వీటిని ట్యాంకర్ల రూపంలో లేకుండా పంట సంజీవిని కార్యక్రమం ద్వారా ఫామ్ ఫాండ్స్ ను ఏర్పాటు చేసుకొని నీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా రాజానగరం నియోజకవర్గంలోని తోకాడ గ్రామానికి చెందిన వ్యక్తికి తొలి గృహనిర్మాణ లోన్ మంజూరు అయిందని దీనికి సంబంధించిన చెక్ ను ఎమ్మెల్యే, కలెక్టర్ తో కలిసి మంత్రి దుర్గేష్ అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదరణ-3 పథకంతో మెరుగైన జీవనోపాధి

మొదటిపేజీ తరువాయి

పెరిగిన సాంకేతితను అందిపుచ్చుకునేలా ఆదరణ-3 పథకం క్రింద ఆధునిక పరికరాలను పంపిణీ చేయాలని సూచించారన్నారు. అలాగే సబ్సిడిపై అందించే ఈపరికరాలను వృత్తికారులకు వ్యక్తిగతం గాను, బారీ పరికరాలను గ్రూపుల విధానంలోను పంపిణీ చేయాలని కోరారన్నారు. వృత్తికార సంఘాల ప్రతినిధుల సూచించిన సలహాలను, వ్యక్తం చేసిన సంశయాలను క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఆయన తెలియజేశారు. రాష్ట్ర బిసి కార్పొరేషన్ విసి-ఎండి ఎ.మల్లికార్జున మాట్లాడుతూ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీలు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం టీడీపీ ప్రభుత్వం ఎల్ల పూడు కట్టుబడి ఉందని, గతంలో కంటె మరింత మెరుగైన రీతిలో ఆద రణ-3 పథకాన్ని అమలు చేయనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ షణ్మో హన్ సగిలి సమావేశంలో వికాస సంస్థ ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మే ళా,వేసవి నుండి రక్షణకు చేపడుతున్న చర్యలపై మీడియాకు వివరి చారు. ఈ నెల 24వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఉన్న వికాస కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని, యువతీ యువకులు ఇంట్లో ఉండి పనిచేసుకునే వర్క్ ఫ్రం హోమ్ విధానంలో, గూగుల్ సంస్థ తరపున పనిచేస్తున్న వర్క్యాసా సంస్థ కంటెంట్ అనాలిస్ట్ ఉద్యోగాలకు వాకిన్ డ్రైవ్ నియామకాలు జరుపుతుందన్నారు. ఈ ఉద్యోగాలకు 2021, 2022, 2023, 2024 సంవత్సరాల్లోఇంజినీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిగ్రీలలో పాసైన వారందరూ ఈ ఎంపికకు హాజరు కావచ్చునని, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల కొరకు 7799376111, 7799376444 ఫోన్ నెంబర్లను సంప్రతి చవచ్చునన్నారు. జిల్లాలో అర్హులైన యువత అందరూ తగువిధంగా ప్రిపేర్ అయి వాకిన్ డ్రైవ్కు హాజరై కావడం ద్వారా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. రానున్న 45 రోజుల్లో దాదాపు 3000 ఉద్యోగాలు జాబ్ మేళాల ద్వారా యువతకు కల్పిస్తున్నామన్నారు. అలాగే ప్రస్తుత వేసవిలో గ్రీష్మ తాపం నుండి ప్రజలకు రక్షణ కల్పించేందుకు జిల్లా అంతటా దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కమీషన్లు, ఎంపిడిఓలు దాతలను సంప్రదించి ఈ సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే వితరణ శీల దాతలు ఈ ప్రజాహిత కార్యక్రమాలకు సహకారం అందించాలని ఆయన కోరారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యోగ మేళా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, వికాస పీడి కే.లచ్చారావు, బిసి కార్పొరేషన్ ఈడి ఎ.శ్రీనివాసరావు, బిసి సంక్షేమ అధికారి యం.లల్లిపాల్గొన్నారు.

# డాక్టర్ పుసులూరికి ఉగాది పురస్కారం



రాజమండ్రి,మేజర్‌న్యూస్ : శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం, వాసవి కళానికేతన్ మరియు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు తెలుగు సంవత్సర ప్రారంభ సందర్భంగా ఈనెల 31వ తేదీన ధవళేశ్వర గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అగస్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉగాది పురస్కార వేడుకలను నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు వరప్రసాద్ ప్రకటించారని కాకినాడవేద విజ్ఞాన ప్రతిష్టానం కమిటీ ఉపాధ్యక్షులు డా.యాతగిరి పరశురామ్ తెలిపారు.ఈసందర్భంగా అఖిలభారత జ్యోతిష సమాఖ్య రాజమండ్రి చాప్టర్ చైర్మన్ మరియు శ్రీ బాలాత్రిపురసుందరి జ్యోతిష వేదిక ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రముఖ జ్యోతిష్య పండితులు డాక్టర్ పుసులూరి సర్వేశ్వర ఫణిశర్మ (ధవళేశ్వరం)కు ఉగాది పురస్కారాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఫణి శర్మ జ్యోతిష రంగంలో అనేక అవార్డులను కైవసం చేసుకోవడమే కాక శ్రీవిద్య ఉపాసకులుపూర్ణ దీక్షపరులుగా ఎంతో ప్రసిద్ధి చెందారని అన్నారు. జ్యోతిషరంగంలో సూర్యచంద్రులు వలే శాశ్వత స్థానంలో ఉన్న ప్రముఖ జ్యోతిషపండితులు స్వర్గీయ డాక్టర్ చెరువుకుపల్లి లక్ష్మీనరసింహ శర్మ ప్రియ శిష్యులుగా మరియు ఆత్మ పుత్రునిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.జలవనరులశాఖ పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టులో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండిబిఏ పట్టాను స్వీకరించారు. ధవళేశ్వరంగ్రామంలో జన్మించిన ఫణిశర్మ జ్యోతిష్య రంగంలో విశేషంగా కృషి చేయడమే గాక దేశవ్యాప్తంగా మంచి కీర్తి ప్రతిష్టలను ఆర్జించడమే గాక పలుమార్లు రాజమండ్రి కేంద్రంగా జ్యోతిష సదస్సులను నిర్వహించడంతోపాటు ,జ్యోతిష రంగంలో ప్రసిద్ధులైన పలువురను ఆహ్వానించి వారందరిని సముచిత రీతిలో సత్కరించారు. అఖిల భారత జ్యోతిష్య సమాఖ్య న్యూఢిల్లీ కేంద్రంగా నిర్వహించబడుతున్న సంస్థను రాజమండ్రి చాప్టర్ గా ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రెండుసార్లు జ్యోతిష్య పరీక్షల నిర్వహించి విద్యార్థులలో ప్రతిభను గుర్తించడమే కాక వారికి జాతీయ స్థాయి సర్టిఫికెట్లతో సత్కరించే బాధ్యతను గత దశాబ్ద కాలంగా విజయవంతంగా నిర్వహిస్తున్నారు. పిఠాపురం కేంద్రంగా నిర్వహిస్తున్న శ్రీ పురోహితిక జ్యోతిష్య విజ్ఞాన పరిషత్‌కు ఉపాధ్యక్షులుగాను, కాకినాడ చెరుకుపల్లి వేదిక్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు కార్యవర్గ సభ్యులుగాను, శ్రీలంక మరియు చండీగర్ కేంద్రంగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆస్ట్రాలజీ స్పిరిచువల్ సైనెస్ జీవిత సభ్యులుగా, శ్రీగాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఉపాధ్యక్షులుగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. జ్యోతిషంగంలో విశేష అనుభవం కలిగి ఉండడమే కాక డాక్టర్ చెరుకుపల్లి ఆశయాలను సమాజానికి అందించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు.కాకినాడ వేదవిజ్ఞాన ప్రతిష్టానం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేకహోమాలతో పాటు సమావేశాలలో ప్రత్యక్షంగా పాల్గొని కార్యక్రమానికి తమ వంతు సహకారాన్ని అందిస్తున్న డాక్టర్ ఫణి శర్మ ఉగాది పురస్కారం అందుకుంటున్న శుభ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

# పోక్సో చట్టంపై అవగాహన



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** ధవళేశ్వరం స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో ఫోస్కోచట్టం పై అవగాహనా కార్యక్రమం చేపట్టారు.ఈ అవగాహనా కార్యక్రమం కి ముఖ్య అతిథిగా రమ్య, 3 వ జూనియర్ సివిల్ జడ్జి మరియు 3వ అదనపు జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజమహేంద్రవరం హాజరు అయి విద్యార్థుల కు పోక్సో చట్టం పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ చిన్నారుల పై జరిగే లైంగిక నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, ఇతర విషయాలు పై విద్యార్థులకి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై క్రాంతి స్కూల్ ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది , విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

**- వినూత్న ప్రయోగాల వైపు విద్యార్థుల అడుగులు**
**- డాక్టర్ బిఈవిఎల్ నాయుడు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ఆరవ సైన్స్ ఎగ్జిబిషన్ "సై-లాండ్"- 2025 కార్యక్రమంలో విద్యార్థుల నుండి విశేష స్పందన వచ్చినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెంపొందించి, నూతన ఆవిష్కరణలు జరిగే విధంగా విద్యార్థులలో సరికొత్త ఆలోచనలు రేకెత్తించే సైన్స్ ఎగ్జిబిషన్ "సై-లాండ్"- 2025 రెండు రోజుల కార్యక్రమంలో రెండవ రోజు పరిసర ప్రాంత కళాశాలల విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల నుండి విశేష స్పందన వచ్చింది. 2500 మందికి పైగా విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ను సందర్శించారు. కృత్రిమ మేధా, డేటా సైన్స్, భౌతిక, రసాయన, జీవ, గణాంక శాస్త్రం, ఎలక్ట్రానిక్ మరియు కామర్స్ విభాగాల్లో 170కి పైగా ప్రాజెక్టులను రూపొందించి, సమాజానికి వాటి ఉపయోగాలను వివరించారు. ఆరవ సైన్స్ ఎగ్జిబిషన్ "సై-లాండ్" విజయోత్సవం సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు మాట్లాడుతూ వినూత్న ప్రయోగాల వైపు విద్యార్థులు అడుగులు వేస్తున్నారని, పుస్తక జ్ఞానంతో పాటు ప్రయోగాత్మకంగా అభ్యసించినప్పుడే విద్యార్థులు పరిపూర్ణం అవుతారని అన్నారు. విద్యార్థుల భావవినమయానికి "సై-లాండ్" సైన్స్ ఎగ్జిబిషన్ ఒక మంచి వేదిక అయిందని అన్నారు. విద్యార్థులు రూపొందించిన నూతన ప్రయోగాలు తక్కువ ఖర్చుతో సమాజహితంగా ఉన్నాయని అన్నారు. రెండు రోజులు జరిగే ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు వివిధ కళాశాలల విద్యార్థులు సందర్శించారని అన్నారు. ప్రాజెక్టుల సందర్శనకు న్యాయ నిర్ణీతలను ఏర్పాటుచేసి ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను మరియు అధ్యాపకులను అభినందించారు. "సై-లాండ్" సైన్స్ ఎగ్జిబిషన్ సందర్శనకు విద్యార్థులకు అవకాశం కల్పించిన శ్రీ చైతన్య ,నారాయణ, ఆదిత్య, ప్రగతి, అఖిల్ , పి. ఆర్ మొదలగు పరిసర ప్రాంత కళాశాలల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. "సై-లాండ్" సైన్స్ ఎగ్జిబిషన్‌లో వాట్సప్ బాట్, ఏఐ మాక్ ఇంటర్వ్యూ, మెంటల్ హెల్త్ మరియు త్రీ సి టెక్నాలజీ , మోబియస్ స్ట్రిప్, సోలార్ బోట్ వంటి ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్తమ ప్రాజెక్టులను తయారుచేసిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, "సై-లాండ్" కోఆర్డినేటర్ మూర్తి, శాఖధిపతులు , అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో విజయవంతంగా ముగిసిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "రెండో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మెటీరియల్స్ మరియు ఎనర్జీ సైన్స్ (ఐసిఎంఈఎస్-2025)" విజయవంతంగా ముగిసింది అని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో -ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి తెలియజేశారు. ఈకాన్ఫరెన్స్‌లో ఆన్ లైన్ కీ నోట్ స్పీకర్‌గా డాక్టర్. దినేష్ బాలసుబ్రమణ్యన్, తైవాన్ దేశం, డాక్టర్ మోహద్ జహీర్ ఖాన్ యుసుఫ్జాయ్, ఐఐటి బిహెచ్‌యు మరియు డాక్టర్ సుమన్ చక్రబోర్తి ,ఐఐటి ఖరాగపూర్ నుంచి పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ ఆఫ్ లైన్ కీ నోట్ స్పీకర్‌గా డాక్టర్. వై. రవికుమార్, ఎన్ ఐ టి వరంగల్ నుంచి పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు వారి యొక్క రీసెర్చ్ పేపర్స్ ని ఇతర దేశాల (రష్యా , స్పెయిన్ మరియు నైజీరియా) యూనివర్సిటీ నుండి మరియు ఇండియా లో వేరువేరు కాలేజీ ల నుండి హైబ్రిడ్ మొడ్ లో ప్రెసెంట్ చేసారు.కీ నోట్ స్పీకర్ ఎపర్స్‌ని మరియు ప్రెసెంటేషన్ ఆధారంగా మార్క్స్ ను ఇచ్చారు. ఎక్కువ మార్కులు వచ్చిన పేపర్ కి బెస్ట్ పేపర్ అవార్డ్‌గా ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో -ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. మొత్తం 38 పేపర్స్ ఆఫ్‌లైన్‌లో ప్రెసెంట్ చేయగా మ్యానుఫ్యాక్చరింగ్ లో 2 పేపర్స్ ,డిజైన్‌లో 2 పేపర్స్ , థర్మల్‌లో 2 పేపర్స్ , కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో 1 పేపర్ , మరియు మెడికల్ సైన్స్‌లో 1 పేపర్ బెస్ట్ పేపర్ అవార్డ్స్ సెలెక్ట్ చేశారు. మొత్తం 196 పేపర్స్ ఆన్‌లైన్‌లో ప్రెసెంట్ చేయగా 16 బెస్ట్ పేపర్స్ అవార్డ్స్‌గా సెలెక్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం బి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ యస్ .రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, వివిధ విభాగాల డీన్ లు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్,ఎస్‌డివివి.యస్ .భీమేశ్వర రెడ్డి ,కన్వీనర్ డాక్టర్ పివి ఎలుమలై కో కన్వీనర్ డాక్టర్ ఏం .జుబేరోద్దీన్ మరియు డాక్టర్ సందీప్ కునార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనపై గ్రామ సభ




కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : కాకినాడ రూరల్ నియోజకవర్గం వలసపాకలలో బిలో పావర్టీ లైన్ పేద వారి కుటుంబాలు సర్వేలో గుర్తించి పేదరిక నిర్మూలనపై గ్రామ సభ కార్యక్రమం పంచాయతీ సెక్రటరీ ఆర్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ మాజీ ఉప సర్పంచ్ సలాది శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ విజన్ 2030 మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు థ్రెడ్జ్ ఐటి ద్వారాగా స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్స్ పెట్టామని, వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణతోపాటు వ్యాపారానికి తక్కువ వడ్డీకి బ్యాంక్ ద్వారా రుణాలు పొందేవిధంగా అవకాశాలు ఉంటాయి అన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా టీటైం అధినేత, కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, అలాగే గ్రీన్-కో అధినేతలు చలమలశెట్టి సునీల్, అనిల్ ని ఉదహరిస్తూ, వారు యెదగడమే కాకుండా కొన్ని వేల ఉద్యోగాలు కల్పించారని, భారత్ దేశంలో టాప్ 5లో ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సూరంపూడి వెంకటరమణ, మాజీ డిసిసిబి డైరెక్టర్ కొల్లుబోయిన సూరిబాబు, ఎక్సైజ్ సిఐ లక్ష్మి, ఈగల మహేష్, వీర మహిళల గంగాద్రీ, కిరణ్, వర్మ, సిఐటియు రమణ పాల్గొన్నారు.

# రైతులకు అధిక దిగుబడులను సాధించేలా సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నాం

- రైతుల ఆర్థిక అభివృద్ధికి అవసరమైన సూచనలతో సహకరిస్తున్నాం
- ఉద్యాన పరిశోధన కేంద్రంలో ఘనంగా కిసాన్ మేళా
- డాక్టర్ వైయస్సార్హెచ్యు వైస్ చాన్సలర్ డాక్టర్ కే.గోపాల్
- కొవ్వూరు శాసన సభ్యులు, ముప్పిడి వెంకటేశ్వరరావు



**కొవ్వూరు,మేజర్న్యూస్ :** రాష్ట్రంలో రైతులకు అధిక దిగుబడులను సాధించేలా సాంకేతిక సహకారాన్ని అందిస్తూ, వారి ఆర్థిక అభివృద్ధికి సహకరిస్తున్నామని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు.శనివారంస్థానిక డాక్టర్ వైయస్సార్హెచ్యు ఉద్యాన పరిశోధన స్థానంలో కిసాన్ మేళా కార్యక్రమంలో శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, ఉద్యాన పరిశోధన స్థానం వైస్ ఛాన్సలర్, డాక్టర్ కే గోపాల్ ముందుగా వ్యవసాయ ప్రదర్శన కేంద్రాలను ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేసి కిసాన్ మేళా ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులను ప్రోత్సహించి అధిక దిగుబడులను, అదనపు ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆమేరకు మరిన్ని ఆవిష్కరణ లకు నాంది పలకాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, లాభసాటిగా ఉండేలా దృష్టి పెడుతున్నట్లు పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించడానికి అనేక నూతన ఆవిష్కరణలు చేపట్టల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు సాంకేతిక సహాయం అందించడం, ప్రకృతి వ్యవసాయం పద్ధతులను ప్రోత్సహించడం, వివిధ పంటలపై అవగాహన పెంచడంద్వారా మానవ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు.రైతులకు మరింత ఉపయోగకరంగా ఉండేవిధంగా, సంబంధిత శాస్త్రవేత్తలు,అధికారుల ద్వారా రైతులకు అవగాహన కనిపిస్తున్నామని తెలిపారు.తగిన మోతాదులో పరిమితికి లోబడి ఎరువులు,సాంకేతిక పరికరాలు సరిపడగా ఉపయోగించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు,పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించడం, ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచడంలో ప్రాధాన్యత ఇచ్చి రైతులను ప్రోత్సహించడం జరుగుతోందని తెలిపారు. వ్యవసాయం వైపు వెళ్లేటట్టు విధంగామన రైతులకుసరైనటువంటి సలహాలుసూచనలు ఇచ్చినట్లయితే రైతుల ఆర్థికంగా బలపడతారని సూచించారు. రైతు దేశానికి వెన్నుముక అని , ప్రతి ఒక్కరూ కూడా మనం ఆహారం తీసుకుని బ్రతకాలి కాబట్టి ఆహారం పండించేది రైతు కాబట్టి రైతుయొక్క యోగక్షేమాలు కూడా చూసు కోవాలన్నారు.శాస్త్రవేత్తలు,నిపుణులు,ఆదర్శరైతులతో వ్యవ సాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చేటట్లుగా రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శకం మేరకుఎరువులుగాని,విత్తనాలగానిఇవ్వడం జరుగుతోందని వెల్లడించారు. రైతులు పంటలు పండించేందుకు కావలసినటు వంటి సాంకేతికవ్యవసాయ పరికరాలు సబ్సిడీ పై ఇవ్వడం జరుగుతొందన్నారు.

అగ్రికల్చర్ సంభం దించిన పరికరాలు, రైతులందరికి ఇవ్వడం, వనరులను సద్వినియోగం చేసుకునే విధానంలో ఇతర పంటలు పండించుకోవడానికి వ్యవసాయంసంబంధించినరైతులకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు రాయితీపై ఇవ్వడం జరుగు తొందన్నారు.ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ కే గోపాల్, మాట్లాడుతూ డా? వై.యస్.ఆర్.ఉద్యాన విశ్వ విద్యాలయము పరిధిలో గల ఉద్యాన పరిశోధన స్థానము, కొవ్వూరు గత 6 దశాబ్దాలుగా అరటిలో గణనీయమైన పరిశోధనలు చేసి సాంకేతిక పరిజ్ఞా నాన్ని రైతులకు అందించడం లో విశేష కృషి చేసి మన రాష్ట్రంలో అరటి ఉత్పత్తి పెరగ డానికి దోహద పడిందన్నారు.ఈ పరిశోధనా స్థానం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింద న్నారు.ఈపరిశోధన స్థానంలో విత్తనపిలక ఎంపిక దగ్గర నుండి వివిధ యాజమాన్య పద్ధతు లైన సమగ్ర ఎరువులు, నీటి యాజమాన్యం,సస్యరక్షణ యాజమాన్యం, సేంద్రియ వ్యవసాయం,కోత అనంతర పరిజ్ఞానం వంటి విషయాలపై సమగ్ర సమాచారాన్ని రైతులకు అందించడమే కాకుండా టిష్యూక ల్చర్ అరటి మొక్కలను ఉత్పత్తిచేసి రైతులకు నాణ్యమైన మొక్కలను సరఫరా చేయడం లో ముఖ్య పాత్ర పోషిస్తున్నదన్నారు.మన రాష్ట్రంలో టిష్యూకల్చర్ అరటి మొక్కలను అందించే సంస్థలలో ఈపరిశోధన సంస్థ ఒక్కటే ప్రభుత్వ రంగసంస్థ అనిపేర్కొన్నారు.ఈపరిశోధనకేంద్రంలోమిగిలిన సాంప్రదాయ రకములైన తెల్ల చక్కెర కేళి,కర్పూర, ఎర్రచక్కెరకేళి, మార్టమన్, కొవ్వూరు బొంత, గోదావరి బొంత వంటి పలు రకాలతో పాటు ఇతర జాతీయ స్థాయిలో విడుదలైన కావేరి కల్కి,పోపావులు,ఫియా-3వంటిఅరటి రకాలలో కూడా టిష్యూ కల్చర్ మొక్కలను వృద్ధిచేసి రైతుల అవసరాలను బట్టి అందించడం జరిగిందన్నారు. ఈ పరిశోధనా స్థానం ద్వారా ఇప్పటి వరకు 13 లక్షలపై చిలుకు టిష్యూకల్చర్ అరటి మొక్కలను రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ పరిశోధనా స్థానం నుండి విడుదలైన కొవ్వూరు బొంత మరియు గోదావరి బొంత అనే కూర అరటి రకాలు మిక్కిలి ప్రాచుర్యం పొంది సాగులో ఉన్నవన్నారు. ఈ పరిశోధనా స్థానం నుండి దుంప పంటలలో గజేంద్ర అనే తీపి కందరకం, భావపురి, గోదావరి చేమ అనే చేమ రకాలు, శబరి అనే పెండ లం రకం విడుదల చేయబడ్డాయన్నారు.ఈ పరిశోధనాస్థానంనుండి నాణ్యమైన టిష్యూకల్చర్ అరటి మొక్కలు రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అందించబడు చున్నవన్నారు. అరటి ఉత్ప త్తిలో మన రాష్ట్రం దేశం లోనే ప్రధమ స్థానాన్ని కైవసం చేసు కుందన్నారు.

ఇటీవల కాలంలో మన రాష్ట్రంలో అరటి సా గు గణనీయంగా పెరగడానికి గల ముఖ్య కారణం టిష్యూ కల్చర్ మొక్కలు అందుబాటు లోకి రావడం మరియు మేలైన యాజమాన్య మెళకువలను ఆచరించడమేనన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన పరిశోధన స్థానం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్ టెన్షన్ బి. గోవింద రాజులు, ఉద్యానవన పరిశోధన స్థానం కొవ్వూరు ప్రిన్సిపల్ సైంటిస్ట్, పి. లలితా కామేశ్వరి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డి . వెంకట స్వామి, సైంటిస్ట్, ఏ. స్నేహలత రాణి, త్రిసభ్య కమిటీ సభ్యులు, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, ఎంపీపీ, కాకర్ల సత్య నారాయణ, జడ్పీటిసి, బి. వెంక టలక్ష్మి, మద్ది పాటి శివరామ కృష్ణ, సాయిన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పిల్లలమర్రి మురళీకృష్ణ, అక్షయపాత్ర రవీంద్ర, కూటమి నాయకులు, ప్రకృతి వ్య వసాయ సిబ్బంది జె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాస ఎగ్జామ్‌పై ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమం

- శిక్షణ పొందిన వారికి పెరవలి మండలంలో 25 పరీక్ష కేంద్రాలు
- పెరవలి ఏపీఎం బండారు రామకృష్ణ



**పెరవలి,మేజర్న్యూస్ :** తూర్పుగోదావరిజిల్లా వయోజన విద్య ఆధ్వర్యంలో మార్చి 22 వ తేదీ శనివారం ఉల్లాస్ పరీక్ష నిర్వహించే ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెరవలి డిఆర్డిఏ ఏపిఎం బండారు రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇన్విజిలేటర్లకు తగు సూచనలు ఇచ్చారు. ఉల్లాస్ అనగా అందరికీ జీవితకాల అభ్యసన అవగాహన అన్నారు. ఈ కార్యక్రమంలో 700 మంది సభ్యులకు 2024 నవంబర్ నుండి నేటి వరకు క్లాసులు నిర్వహించడం జరిగింది అన్నారు . వీరికి మార్చి 23వ తేదీ ఆదివారం పెరవలి మండలంలో 25 పరీక్ష కేంద్రాలులో ఉల్లాస ఎగ్జామ్ నిర్వహిం చబడుతుందని అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బండారు రామకృష్ణ తెలియజేశారు. ఈ పరీక్ష సమయం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య అభ్యాసకులకు అనుకూలమైన సమయంలో వచ్చి పరీక్ష రాయవలసి ఉంటుంది. ఆ కార్యక్రమంలో భాగంగా ఇన్విజిలేటర్స్ కు ఆదివారం జరిగే పరీక్ష ఏ విధంగా నిర్వహించాలి అనే అంశంపైన శిక్షణ ఇవ్వడం జరిగింది మరియు పరీక్ష కేంద్రాలు వారిగా మెటీరియల్ ఇవ్వడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్విజిలేటర్లు, సిసిలు కె. కనకదుర్గ, టి శ్రీనివాస్, అకౌ ంటెంట్ టి.మహాలక్ష్మి మరియు వాలంటరీ టీచర్స్ పాల్గొనడం జరిగింది.

# అసంఘటిత రంగం కార్మికులు

- ఈ- శ్రమ కార్డులు నమోదు చేసుకోవాలి
- మెప్మా సిటీ మేనేజర్ ఎస్డీ హుస్సేన్



**సామర్లకోట,మేజర్న్యూస్ :** అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులందరూ ఈ - శ్రమ కార్డులు నమోదు చేసుకోవాలని దీని ద్వారా రెండు లక్షలు ఇన్సూరెన్స్ లభిస్తుందని సామర్లకోట మెప్మా సిటీ మేనేజర్ ఎస్డ్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయం తక్కువ ఉన్న వారందరూ ఈ శ్రమ కార్డులను నమోదు చేసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని ప్రతి ఒక్కరు దీని వినియోగించుకోవాలని కోరారు నెలకి 15000 రూపాయలు లోపు ఆదాయం ఉన్న వారు, ఈపీఎఫ్ పీఎఫ్ లేని వారు, కాంట్రాక్టు కార్మికులు ఈ శ్రమ కార్డులు నమోదుకు అర్హులని తెలిపారు.ఈ శ్రమ కార్డుల ద్వారా యాక్సిడెంట్లుగా మరణిస్తే రెండు లక్షలు ఇన్సూరెన్స్ లభిస్తుందని తెలిపారు అదేవిధ ంగా కార్డ్ నమోదు చేసుకొని అనంతరం 60 ఏ ళ్ళు దాటిన వారికి వృద్ధాప్య పెన్షన్ క్రింద నెలకు 3 వేలు లభిస్తుందని తెలిపారు. అసం ఘటిత రంగ విభాగంలో ఉండి ఆదాయం తక్కువ ఉన్నవారు ఈ శ్రమ కార్డుల కొరకు 16- 59 సంవత్సరాలు లోపు వారు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే కార్డు లభిస్తుందని తద్వారా ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు సామర్లకోట మున్సిపాలిటీలో ఇప్పటివరకు డ్వాక్రా సీఆర్పీలు ద్వారా ఈ - శ్రమ కార్డులు 2200 చేయించామని తెలిపారు.

# సంకల్ప మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

- నైపుణ్యం పెంచే విధంగా శిక్షణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది
- జాబ్ మేళా లని సద్వినియోగం చేసుకోవాలి
- జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న సంకల్ప - జాబ్ మేళా లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంకల్ప మెగా జాబ్ మేళా ను జెసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, జిల్లాలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించే ఉద్దేశంతో నైపుణ్యాభివృద్ధి , జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మెగా జాబ్ మేళాలో 36 ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయన్నారు . వివిధ ఉద్యోగాల్లో చేరేందుకు ఎస్.ఎస్.సి, ఐటీఐ, సీ ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీ.టెక్, ఎం.టెక్, ఫార్మసీ, ఎం.బి.ఎ, ఎం.కాం తదితర కోర్సులు పూర్తిచేసిన 19 నుండి 50 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులైన అభ్యర్థుల ఎంపికపై జాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ జాబ్ మేళా కు పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత హాజరవడం జరిగిందన్నారు. ఆయా కంపెనీలకు అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.నిత్యం నైపుణ్యం పెంచుకోవడం ద్వారా మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి విజిడి మురళి, జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిశ్చంద్ర ప్రసాద్, ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపల్ రామచంద్ర రావు, పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత హాజరయ్యారు.

# జెఎన్టీయుకెలో జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్






**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో యుసిఇకెలోని సివిల్‌ఇంజనీరింగ్(సిఈ)విభాగంవారు సౌధా-2కె25పేరుతో జాతీయ స్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్‌ను రెండు రోజులపాటు నిర్వహించను న్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఉదయం అలూమ్ని ఆడిటోరియంలో నిర్వహించారు. యుసిఇకె ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ సీ పోర్ట్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.రవికుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా విశిష్ట అతిథిగాఉపకులపతి ప్రొ.సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ విచ్చేశారు. అతిథిగా ఓఎస్‌డి&సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొ. డి.కోటేశ్వరరావు వేదికనలంకరించారు. జ్యోతిప్రజ్వలన అనంతరం సివిల్ ఇంజనీరింగ్ విభాగం సావనీర్‌ను ముఖ్యఅతిథి మరియు అతిథులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి పి.రవికుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులకు ఇటువంటి టెక్‌ఫెస్ట్‌లుచాలాఅవసరమన్నారు. విద్యార్థులు తమకెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేం దుకు టెక్‌ఫెస్ట్‌లు గొప్ప అవకాశమన్నారు. వినూత్న ఆవిష్కరణలు, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు, స్టార్టఫ్‌లకు టెక్‌ఫెస్ట్‌లు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. ప్రస్తుత ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించడం ద్వారా నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ సీ పోర్ట్స్ చేపడుతున్న కార్యకలాపాలను వీడియో ప్రజంటేషన్ ద్వారా వివరించారు. దేశం మొత్తం మీద తొలుత ఇక్కడే సిసి కెమెరాలుఏర్పాటుచేసి పోర్టుకార్యకలాపాలను పర్యవేక్షించడం జరిగిందన్నారు. పోర్టులో 24/7కార్యకలాపాలనునిర్వహించడం జరుగుతుందని, ఏ వాతావరణంలోనైనా సంవత్సరం పొడవునా పనులు జరుగుతాయన్నారు. దేశంలోనే అతి తక్కువ బెర్త్ వెయిటింగ్ టైమ్ ఉండే పోర్ట్ ఇదేనన్నారు. ఈపోర్టులో విశాలమైన, సురక్షితమైన గిడ్డంగులు, ద్రవ ట్యాంకులు, నిల్వ యార్డులు ఉన్నాయన్నారు. రైలు మరియు రోడ్డు అనుసంధానంతో సమర్థవంతమైన కార్గో తరలింపు వ్యవస్థ ఉందన్నారు. ఉపకులపతి ప్రొ. సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి టెక్‌ఫెస్ట్‌లు నిర్వహిస్తున్న సివిల్ ఇంజనీరింగ్ విభాగాన్ని, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జెఎన్‌టియుకె విద్యార్థులు సమాజ హితం కోరే నూతన ఆవిష్కరణలు చేపట్టి యూనివర్శిటీ పేరును ఇనుమడింపజేయాలన్నారు. విద్యార్థుల ప్రతిభా పాటవాలను గుర్తించడంతో పాటు దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. నూతన సాంకేతిక విషయ పరిజ్ఞానం పెంపొందించేలా ఫెస్ట్‌లను రూపకల్పన చేయాలని విద్యార్థులకు సూచించారు. వచ్చే ఏడాదికి 1500 మంది సీటింగ్ సామర్థ్యంతో నిర్మిస్తున్న ఆడిటోరియం అందుబాటులోకి రానుందని, తద్వారా అన్ని ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు ఒకేసారి టెక్‌ఫెస్ట్‌లు నిర్వహించేందుకు వీలు కలుగుతుందన్నారు.

ఓఎస్‌డి&సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొ.డి.కోటేశ్వరరావు మాట్లాడుతూనాగరికత అనేది సివిల్ ఇంజనీర్ల నుండి ఉద్భవించింద న్నారు. సివిల్ ఇంజనీర్లు జాతి నిర్మాణానికి పునాది రాయి వంటివార న్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. నీటి ద్వారానే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మనుగడ సాగిస్తుందన్నారు. నీరు లేకపోతే జీవరాశే ఉండదని, ప్రతీ అంశానికి నీటితో సంబంధం ఉందని, నీటిని వృథా చేయరాదన్నారు. అనంతరం ముఖ్యఅతిథి పి.రవికుమార్‌ని అతిథులు దుశ్శాలువాతో సత్కరించి మెమెంటోను బహూకరించారు.

టెక్‌ఫెస్ట్‌లో భాగంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఏర్పాటుచేసిన వర్క్‌షాప్స్, ప్రాజెక్ట్‌లు, పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, ఎగ్జిబిషన్స్‌ను ఉపకులపతి ప్రొ.సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ గారు ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.ఎం.స్వరూపారాణి, డైరెక్టర్‌లు, అధ్యాపకులు, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లతో కలిసి సందర్శించారు.

టెక్‌ఫెస్ట్‌లోభాగంగా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్స్, ప్రాజెక్ట్‌లు, పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, పవర్‌పాయింట్ ప్రజంటేషన్, బ్రిడ్జ్ బిల్డింగ్, ఎగ్జిబిషన్స్, కాంక్రీట్‌కంబాట్, టెక్ ఐడియాస్, కన్‌స్ట్రక్టో, ట్రెజర్ హంట్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, డ్రోన్ ప్రజంటేషన్, స్పాట్ ఈవెంట్స్, టెక్నికల్ క్విజ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు, యుసిఇకె మరియు అనుబంధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణంపై అవగాహన సదస్సు



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని యుసిఇకెలోని సివిల్ ఇంజనీరింగ్ (సిఈ) విభాగం ఆధ్వర్యంలో సివిల్ సెమినార్ హాలు నందు పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓఎస్‌డి&సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొ. డి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమానికి గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ. సిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా అతిథులుగా చీఫ్ ఇంజనీర్ ప్రొ.వి.శ్రీనివాసులు, యుసిఇకె ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.ఎం.స్వరూపారాణి విచ్చేశారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలకృష్ణ రీసోర్స్‌పర్సన్‌గా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.సిఎస ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ మంచినీటి యొక్క ప్రాముఖ్యతపై దృష్టి సారించేందుకు ప్రతీ సంవత్సరం మార్చి 22వ తేదీన నిర్వహించుకునే ప్రపంచ జల దినోత్సవాన్ని జరుపుకొంటున్నామ న్నారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా 2030 నాటికి అందరికీ నీరు అందించాలని, నీటిని ప్రతీఒక్కరు సంరక్షించుకుంటూ భావితరాలకు అందించేందుకు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. రీసోర్స్‌పర్సన్ బాలకృష్ణ మాట్లాడుతూ భారత దేశంలో నీటి వనరులకు కొదవ లేదని, ప్రతీ అంశానికి నీటితో సంబంధం ఉందని, అందుచేత నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ రూపకల్పనకు ముఖ్యకారణం 1831లో సంభవించిన వర్షాలు, 1832లో వచ్చిన తుఫాను, 1833లో సంభవించిన లోటు వర్షపాతం అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ అనేది గేమ్ చేంజర్ ప్రాజెక్ట్ అని, ఈ ప్రాజెక్ట్ పూర్తయితే సుమారుగా 30లక్షల ఎకరాలకు నీరు అందుబాటులోకి రావడంతో పాటు వరదలను నియంత్రించవచ్చున న్నారు. అలాగే 540 గ్రామాలకు త్రాగునీరు సౌకర్యం కలగడంతో పాటు ఒడిషా, చత్తీష్‌ఘడ్ రాష్ట్రాలు కూడా ప్రాజెక్ట్ ద్వారా విడుదలయ్యే నీటిని వినియోగించుకోవచ్చునన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా 24గంటల్లో 32వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను పోయడం ద్వారా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులలోకి చేరిందన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న డయాఫ్రాం వాల్, స్పిల్ వే, హైడ్రో పవర్ ప్రాజెక్ట్, ప్రధాన ప్రాజెక్ట్, అప్రోచ్ ఛానల్స్ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

**– వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ**



పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్యాణాధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,34,930/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.56,205/-లు, కేశఖండన ద్వారా రూ.5560/-, తులాభారం ద్వారా రూ.550/- లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.24,915/- మొత్తం రూ.3,22,160/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. వేద పండితులు ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆర్.బి.పట్నంలో మినీ గోకులాలు ప్రారంభం

**– పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప**



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, ఆర్.బి.పట్నం గ్రామంలో శనివారం ఎంపిడిఓ డి.శ్రీలలిత, ఎపిడి భానుప్రకాష్‌ల ఆధ్వర్యంలో సర్పంచ్ చీకట్ల లక్ష్మీ, ఎంపిపి పెంకే వెంకటలక్ష్మీల అధ్యక్షతన మినీ గోకుళాలు, ఇంకుడు గుంటలు ప్రారంభం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొని మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం మినీ గోకులాలు, పశువుల షెడ్లు ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలో ఇంకుడు గుంతలు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపి నాయకులు నూనె రామారావు, కల్తూరి శ్రీనివాస్, మన్యం ప్రసన్న, దొరబాబు, సురేష్, నల్లల శ్రీను, కూటమి నాయకులు, ఇఓ & పిఆర్‌డి బి.వి.వి.రమణ, ఎన్‌ఆర్‌ఇజియస్ జెఇ సతీష్ కుమార్, ఎపిఓ సుధీర్, పంచాయతీ సెక్రటరీ ఫణికుమార్, పలువురు టిడిపి కార్యకర్తలు, ఎన్.ఆర్.ఇ.జి.యస్.సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ కళ్యాణ మండపం అభివృద్ధి నిమిత్తం లక్ష రూపాయల విరాళం



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలో ఈతకోట గ్రామంలో కొత్త సెంటర్ జాతీయ రహదారి చెంతననున్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయ కళ్యాణ మండపం అభివృద్ధి నిమిత్తం కొత్తపేట నియోజకవర్గం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మురళీకృష్ణ, రైస్ మిల్ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు కళ్యాణ మండపంలో రెండు ఏ.సిలు వేయించు నిమిత్తం లక్ష రూపాయలను ఆలయ కమిటీ ఛైర్మన్ వెలుగట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహాయ సహాకారాలతో అందిస్తున్న సేవలను పాపారావు అడిగి తెలుసుకున్నారు.

# ముగిసిన 'టాలీ' శిక్షణా కార్యక్రమం






**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) పరిపాలనా భవనంలోని పిజి రీసెర్చ్ ల్యాబ్ నందు జెఎన్‌టియుకె మరియు యుసిఇకె నాన్ టీచింగ్ సిబ్బందికి వారం రోజుల పాటు నిర్వహించిన 'టాలీ' శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. యుసిఇకె సెమినార్ హాలులో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్కె.ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా గౌరవ అతిథులుగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, జాయింట్ రిజిస్ట్రార్ జి.జోగారావులు విచ్చేశారు. ఎఫ్‌డిసి డైరెక్టర్ ప్రొ.పి. సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి విక్రమాదిత్య & అసోసియేట్స్ ప్రతినిధి టి.భాను పృధ్వీరాజ్ రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించగా ఎస్ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.జి.కె.కశ్యప్, సిఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.రఘురామ్‌లు కో-ఆర్డినేటర్‌లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్కె.ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతికత యుగంలో సమాచార నిర్వహణ అంతా డిజిటలైజ్ అవుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతీ ఒక్కరు టాలీ సాఫ్ట్‌వేర్‌పై పట్టు సాధించి అకౌంట్స్ విభాగంలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండేలా చూడాలన్నారు. టాలీ సాఫ్ట్‌వేర్ ద్వారా అకౌంట్స్ విభాగాన్ని డిజిటలైజేషన్ చేయడం ద్వారా సమయం ఆదా అవుతుంద న్నారు. యూనివర్శిటీలోని అకౌంట్స్ విభాగంలో ప్రతీ లావాదేవీ టాలీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలన్నారు. వచ్చే ఏప్రియల్ 1వ తేదీ నుండి ఈ విభాగంలో టాలీని అమలు చేయనున్నామన్నారు. మనం నేర్చుకున్న తర్వాత పనిచేసుకుంటూ ఉంటే రాని అంశం కూడా దానంతట అదే వస్తోందన్నారు. తొలుత టాలీ సాఫ్ట్‌వేర్‌లో లావాదేవీలు నమోదు చేసేటపుడు కొన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని తొందరగానే అధిగమిస్తారని ఆశిస్తున్నా న్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు ప్రతీ ప్రభుత్వ కార్యా లయం, విద్యాసంస్థల్లో కాగితరహితం (పేపర్‌లెస్) గానే కార్యకలాపాలు చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారని, దీని దృష్ట్యా యూనివ ర్శిటీలో ఏ విభాగానికి చెందిన అంశమైనా ఇ-ఆఫీస్ ద్వారానే పంపించా లన్నారు. అదేవిధంగా కేంద్ర విద్యా శాఖ ప్రారంభించిన సమర్థ్ ద్వారా విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలను డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌లో తీసుకురానుందని, దీని ద్వారా విద్యార్థుల ప్రణాళిక, నిర్వహణ, డెలివరీ, ఇతర సేవలను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. దీన్ని కూడా త్వరలో అమలు చేసేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్ టాలీ శిక్షణా కార్యక్రమానికి హాజరైన నాన్ టీచింగ్ సిబ్బందికి సర్టిఫికెట్‌లను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, జూనియర్ అసిస్టెంట్‌లు, రీసోర్స్‌పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఫారం పాండ్ పనులు ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని 19 పంచాయతీలకు చెందిన గ్రామాలలో శనివారం ఫారం పాండ్ ( సాగునీటి చెరువులు) పనులు ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పరిష్కరించుకొని ప్రతి గ్రామానికి చెందిన పొలాల్లో ఫారం పాండ్స్ నిర్మించి నీటి వసతి మెరుగు పర్చాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు ప్రపంచ జల దినోత్సవం రోజున ప్రతి గ్రామంలోఉపాధి హామీ ద్వారా ఇప్పటికే పనులు పూర్తయిన ఫారం పాండ్స్ ( సాగునీటి చెరువులు) అధికారులు ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు.




లాగరాయికి చెందినకానేం చిన్నయ్య , సూరంపాలెంకు చందనఊక పెంటయ్య పొలాలులోఫారం పాండ్ పనులు ఎంపీపీ గోము వెంకట లక్ష్మీ, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, ఎంపీటీసీగొల్లపూడి పెద్దిరాజు ప్రారంభించారు. అలానే బొడ్డ గంది గ్రామ పొలాల్లో చిరాబు చిరాబుకిర్రబు సర్పంచ్కొర్రా బుజ్జమ్మ ప్రారంభించారు. ఉపాధి కూలీలతో కలిసి ప్రపంచ జల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫారం పాండ్ ద్వారా రైతులు సాగునీటిని ఉపయోగించు కోవాలని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి జ్యోతి, గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. ప్రతి నీటి బొట్టుని ఒడిసి పెడదాం, బావి తరాల భవిష్యత్తుకు గొంతు తడుపుదాం, నీరే జీవనాధారం, నీరు ఉంటే ఏదైనా సజీవం లేకుంటే సమస్త ప్రపంచం నిర్జీవం, ప్రతి ఒక్కరు సాగునీటి చెరువుల , ఇంకుడు గుంటలు నిర్మించడం వల్ల మనవాడే నీరు, వర్షపు నీరు వృధా కాకుండా ఉపయోగపడుతుందని ఫారం పాండ్ వల్ల కలిగే ప్రయోజనాలు ఎంపిడిఓ యాదిగిరేశ్వరావు ఏపీఓ రెడ్డి బాబు వివరించారు.ఎంపీటీసీ గంగ దుర్గ, నాయకులు కనిగిరి వీరబాబు, బొడ్డు వెంకన్న తదితరులు వున్నారు.

# బాల్య వివాహ నిరోధంపై ప్రచారోద్యమ కార్యక్రమము



**కాకినాడ రూరల్,మేజర్‌న్యూస్ :** కాకినాడ రూరల్ మండలంలోని పండూరు గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్), చైల్డ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బి.కుమారి,కాకినాడ రూరల్, సిడిపిఓ ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మశ్రీ, రాజేశ్వరి, మార్థ, సింహాచలం, జెడ్‌పిహెచ్ స్కూల్ హెచ్ఎం మేడం వారి ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధంపై ప్రచారోద్యమం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల్య వివాహ చట్ట ప్రకారం బాలుడికి 21 సంవత్సరములు, బాలికకు 18 సంవత్సరములు నిండకుండా బాల్య వివాహం చేయకూడదు చట్టరీత్యా నేరం. చిన్న వయసులో బాలికకు పెళ్లి చేసిన ఎడల భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలు, రక్తహీనత, శారీరిక సమస్యలు,రుగ్మతలు, ఆర్థిక ఇబ్బందులు వలన బాలిక చాలా ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. బాల్యవివాహాన్ని ఆపడం మన గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత. మన గ్రామంలో బాల్య వివాహం జరిపిన యెడల టోల్ ఫ్రీ నెంబర్ 112,1098 కి సమాచారాన్ని తెలియజేయండి.మీ యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. ప్రతి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం. మన గ్రామాన్ని, మన మండలాన్ని, మన జిల్లాని, బాల్య వివాహ రహిత జిల్లాని తీర్చిదిద్దుదాం అన్నారు. "బాల్య వివాహం వద్దు, చదువు ముద్దు"అని నినదించారు.ఈ కార్యక్రమంలో క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ బి.కుమారి ,సిడిపిఓ ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మశ్రీ, రాజేశ్వరి,మార్థ, సింహాచలం, జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం మేడం మరియు అంగన్వాడి టీచర్లు,ఏ.ఎన్.ఎం,ఆశ వర్కర్, మరియు కాకినాడ సీఎస్‌డబ్ల్యు పుష్ప, డ్వాక్రా మహిళలు మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు ఉపాధి కల్పించడమే కుటమి ప్రభుత్వం లక్ష్యం

**- ఉపాధి హామీ ద్వారా ఫారం పాండ్**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ పట్టుచీర గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భాస్కర్ల ఆదేశాల మేరకు గతంలో పల్లె పండుగ కార్యక్రమం చేయడం జరిగింది. గ్రామసభల ఏర్పాటు ద్వారా గుర్తించిన పనులకు కణితి మధు, గ్రామపంచాయతీ వ్యవహారాల ఇన్చార్జి వాసం రాము, మాజీ సర్పంచ్ పెనుబల్లి సీతయ్య భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ కణితి మధు మాట్లాడుతూ గ్రామల అభివృద్ధి కూటమి ప్రభుత్వ యొక్క లక్ష్యమని, పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టింది అని, లక్ష్మీపురం పంచాయతీలో 2024-25 సంవత్సరానికి గాను సుమారు ఒక కోటి 11 లక్షలు వ్యయంతో లక్ష్మీపురం పంచాయతీలో పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. ఈ ఫారం ఫండ్ జాతీయ ఉపాధి హామీ పనుల ద్వారా లక్ష్మీపురం పంచాయతీలో 101 పనులు శాంక్షన్ అవ్వడం జరిగిందని, ఇందులో భాగంగా 56 పనులకు గాను కూలీలకు 93 లక్షల రూపాయలు అందనుందని, లక్ష్మీపురం పంచాయతీ ఉపాధి హామీ కూలీలకు ఈ పనుల ద్వారా ఒక పండుగ వాతావరణంగా కనిపిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉండేటి వెంకన్న, తెల్లం సత్యం, టీవి కణితి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ దాసు లక్ష్మీ, మెట్ల పనితీ దానియేలు, కర్లపూడి ప్రకాశరావు, కొట్టే ఏసులు, రైతులు సున్నం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మందేశ్వరస్వామికి భక్తుల తైలాభిషేకాలు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర)స్వామి వారి దేవస్థానంలో శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు.తెల్లవారుజాము నుండి స్వామి వారికి ప్రాతఃకాల అర్చన నిర్వహించి,అనంతరం భక్తులచే తైలాభిషేకాలు,సర్వ దర్శనములు జరిపించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంఛార్జి ఆలయ సహాయ కమిషనర్,కార్య నిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.తైలాభిషేకముల ద్వారా రూ.1,70,490 అలాగే అన్న ప్రసాదం విరాళాలుగా రూ.34,815 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

## పథక సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన సాయినాథ్ జయచంద్ర



**అమలాపురం, మేజర్ న్యూస్ :** విజయవాడ డివిజన్ నందు అదనపు పథక సంచాలకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న టి. సాయినాథ్ జయచంద్ర(గాంధీ), పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి డిపార్ట్మెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెర్ప్, విజయవాడ వారి ఉత్తర్వులు అనుసరించి బదిలీపై పథక సంచాలకులుగా, డి.ఆర్.డి.ఎ, డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు వచ్చినందున జిల్లా కలక్టర్‌ని మర్యాదాపూర్వకంగా కలిసి విధులకు హాజరగుచున్నట్లుగా జాయినింగ్ రిపోర్ట్ సమర్పించినారు, అనంతరం డి.ఆర్.డి.ఎ, ముమ్మిడివరం కార్యాలయమునకు హాజరై పథక సంచాలకులుగా చార్జ్ తీసుకున్నారు.

# 'ఉపాధి' పథకంలో 3వేల ఫారం పాండ్లు నిర్మాణం





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని ఏడు మండలాల్లో సుమారు 3 వేల ఫారం పాండ్లు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం తెలిపారు. రంపచోడవరం మండలం రంప పంచాయతీ పరిధిలోని పందిరి మామిడి గ్రామంలో ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఫారం పాండ్లు ప్రారంభోత్సవానికి ప్రాజెక్ట్ అధికారి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి 25 ఫారం పాండ్లు చొప్పున గిరిజన రైతులకు ఉపయోగపడే విధంగా సుమారు మూడువేల ఫారం పాండ్లు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసి ముందుగా వెయ్యి ఫారం పాండ్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మిగిలిన 2 వేల ఫారం పాండ్లు ఈ సంవత్సరం ఏప్రిల్, మే, జూన్ నెలలో పూర్తిచేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఫారం పాండ్లు ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటుచేసిన ఫారం పాండ్లు ఉన్న రైతులు నీటి నిల్వలను బట్టి చేపలు పెంచుకోవచ్చునన్నారు. అదేవిధంగా ఫారం పాండ్లు పరిధిలో జీడిమామిడి వంటి ఉద్యానవన ఫారం, పంటల్లో క్షేత్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒక్కొక్క రైతుకి 50వేల రూపాయల నుండి మూడు లక్షల 50 వేల రూపాయల వరకు మంజూరు చేసి ఫారం పాండ్లు తవ్వించడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి వేతన దారుడికి ప్రతిరోజు 300 రూపాయలు చొప్పున చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రంపచోడవరం ఉపాధి హామీ పథకం ఎపిడి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిపంచాయతీ పరిధిలో మంజూరైన ఫారం పాండ్లు త్వరితగతిన పూర్తి చేసి మానిటరింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు నిబంధనలు ప్రకారం వేతనాలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, రంప పంచాయతీ సర్పంచ్ చెదల. వెంకటలక్ష్మి, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, ఉపాధి హామీ పథకం ఏపీవో బి.సత్యనారాయణ,టీఏ వాకావీరన్న,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతుల వివాహ రజితోత్సవ వేడుకలు


**- హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూటమి నాయకులు**




**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** స్థానిక పరిణయ ఫంక్షన్ హాల్ లో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతుల 25వ పెళ్లిరోజు సందర్భంగా జ్యోతుల నవీన్ తనయుడు అనీష్‌నెహ్రూ అంగరంగ వైభవంగా నవీన్‌లక్ష్మీదేవి దంపతుల వివాహ రజతోత్స వేడుకలు నిర్వహించారు. ముందుగా జగ్గంపేట నవీన్ ఇంటివద్ద అన్నవరం సత్యనారాయణ స్వామి వారి వ్రతం నోచుకుని పరిణయ ఫంక్షన్ హాల్ కు చేరుకున్నారు. నవీన్ తల్లిదండ్రులు జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ మణి దంపతులు నవీన్ లక్ష్మీదేవి లకు దండలు మార్పించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందించారు. జ్యోతుల నవీన్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్,అనంత ఉదయ భాస్కర్, కూడా చైర్మన్ తుమ్మల బాబు, మాజీ ఎంపీ గిరిజాల వెంకటస్వామి నాయుడు, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఎస్ వి ఎస్ ఎన్ వర్మ, పర్వత బాపనమ్మ, గన్ని కృష్ణ ,రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు శ్రీరామ్ సత్య నారాయణ, నిమ్మకాయల రంగనాథ్, జక్కంపూడి గణేష్, వరుపుల తమ్మయ్య బాబు, తుమ్మలపల్లి రమేష్, నాలుగు మండలాల అధికారులు, కుటమి నాయకులు, వేలాదిగా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 2024-25 రబీ సీజన్లో రైతు పండించిన ధాన్యాన్ని పారదర్శకంగా కొనుగోలు చేసేలా కార్యాచరణ

**- జిల్లాలో 216 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రాథమికంగా 2.00 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ..**
**- రబీలో పండిన ధాన్యం సేకరణకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ..**
**- ఏప్రియల్ ఒకటవ తేదీ నాటికి ఆర్‌ఎస్‌కెలని సిద్ధం చెయ్యాలి**
**- మిల్లర్లు అధికారుల మధ్య సమన్వయం ముఖ్యం**
**- జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు**



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ప్రస్తుత 2024-25 రబీ సీజన్లో రైతు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను అందించి, పండిన ధాన్యం సేకరణ కోసం ప్రాథమికంగా 2.00 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికను అమలు చెయ్యవలసి ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో 2024-25 రబీ సీజన్లో ధాన్యం సేకరణపై రెవెన్యూ, పౌర సరఫరాల, వ్యవసాయ, సహకార, తూనికలు కొలతలు, రవాణా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, స్టేక్‌హోల్డర్స్,కస్టోడియన్ అధికారులతో తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు చేసేలా రైతు సేవా కేంద్రాలలో అన్నీ మౌలిక సదుపాయాలు అందుబాటులో తీసుకుని రావాలని స్పష్టం చేశారు. ఏప్రియల్ ఒకటవ తేదీ నాటికి 216 రైతు సేవా కేంద్రాలను సిద్ధం చేసి ఆమేరకు కొనుగోళు చేపట్టడం జరగాలని ఆదేశించారు. కొనుగోళ్లు విషయంలో స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ కు ఖచ్చితంగా పాటించడం ముఖ్యం అన్నారు. ఇప్పటి వరకు 6 సీజన్లలో ధాన్యం సేకరణ.చేపట్టడం జరిగిందని, ప్రస్తుతం 7 వ సీజన్ కొనుగోలుకు సంబంధించి అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం సేకరణ పనులని నిబద్ధత కలిగి నిర్వర్తించాల్సి ఉంటుందనీ స్పష్టం చేశారు. మిల్లర్లు జిల్లా యంత్రాంగం మధ్య అనుసంధానం అత్యంత కీలకం అన్నారు. గత సీజన్ ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్ల సహకారం అందించడం ద్వారా లక్ష్యాలను సాధించడం జరిగిందన్నారు. ప్రస్తుత రబీసీజన్లో కూడా ఇదే రకమైన సహకారం అందించి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు అవసరమైన గన్ని బ్యాగులను సిద్ధం చేసుకుని, రబీ సీజన్ ధాన్యం సేకరణ కు సహకారం అందించాలని కోరారు.నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు జెసి చిన్న రాముడు పేర్కొన్నారు. గతంలోనీ అనుభవాలను దృష్టిలో ఉంచుకొనిసరియైన ప్రణాళిక సిద్ధం చేసుకో వాలనికోరారు.సమావేశంలో వొచ్చినసూచనలను మినిట్స్ నమోదు చెయడం ద్వారా భవిష్యత్ కార్యాచరణ రూపొందించవలసి ఉంటుంద న్నారు. ఈసమావేశంలో ఇంఛార్జి డిఎస్‌వో ఎస్.భాస్కర్ రెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి.రాధిక,ఇతర అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

### జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతుల వివాహ రజితోత్సవ వేడుకలకు హాజరైన తుమ్మలపల్లి రమేష్



జగ్గంపేట, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తనయుడు జ్యోతుల నవీన్ కుమార్ మరియు లక్ష్మీదేవి దంపతుల 25వ పెళ్లిరోజు పురస్కరించుకుని పరిణయ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన వేడుకకు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్ లక్ష్మీ దేవి దంపతులకు 25వ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసి ఇలాంటి పెళ్లి రోజులు మరేన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శేఖర్, కుంచె రాజా, ఎంపీటీసీ దొడ్డా శ్రీను,కోటి, కాకిలేటి బాబ్జి, ఉలిసి ఐరాజు,మాదారపు వీరబాబు,మొగిలి గంగాధర్,సింగూలూరి రాందీపు,సత్యంశెట్టి గణేష్, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ,సత్తి సోమరాజు,దేగల విజయ్, రాజనాల శ్రీను,సూరపురెడ్డి నరేష్,కర్ణాకుల సూరిబాబు, గంటా తేజ, డాక్టర్ నాని, విష్ణు,అడబాల వీరబాబు, గంధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మందేశ్వరస్వామికి భక్తుల తైలాభిషేకాలు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర)స్వామి వారి దేవస్థానంలో శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండి స్వామి వారికి ప్రాతఃకాల అర్చన నిర్వహించి,అనంతరం భక్తులచే తైలాభిషేకాలు,సర్వ దర్శనములు జరిపించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంఛార్జి ఆలయ సహాయ కమిషనర్,కార్య నిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.తైలాభిషేకముల ద్వారా రూ.1,70,490అలాగే అన్న ప్రసాదం విరాళాలుగా రూ.34,815 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

### మూడవరోజు 'పోషన్ భీ పడాయి భీ' శిక్షణ కార్యక్రమం



**యు.కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** పోషన్ భీ పడాయి భీలో మూడవ రోజు శిక్షణ కార్యక్రమం వాకతిప్ప హై స్కూల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ సిహెచ్.కె.దుర్గాదేవి ఆధ్వర్యంలో దివ్యాంగ్ చిల్డ్రన్ గురించి శిక్షణా నిర్వహించారు. వివిధ రకాల వైకల్యాలను ముందుగా గుర్తించడం ద్వారా అభివృద్ధి ఆలస్యం లేదా వైకల్యాలున్న పిల్లలకు ప్రయోజనం చేకూరుతుందని, వికలాంగ హక్కుల చట్టం 2016 ప్రకారం వైకల్యం ఉన్న పిల్లలు అవసరాలు మరియు హక్కులు - ఈ చట్టం వారి ప్రారంభ సంవత్సరాల్లో వైకల్యం ఉన్న పిల్లలు హక్కులను గుర్తిస్తుందని, ఇటువంటి పిల్లలకు పోషణ సంరక్షణలో ఐదు భాగాలు ఉంటాయి - మంచి ఆరోగ్యం, తగిన పోషణ, భద్రత, నేర్చుకునే అవకాశాలు, ప్రారంభ విద్య అవకాశాలు కల్పించాలని అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. సూపర్వైజర్స్ అనంత లక్ష్మి, సారమ్మ, శ్రీదేవి, సుజాత పాల్గొన్నారు. శనివారంతో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ ముగిసిందని సూపర్వైజర్ అనంతలక్ష్మి తెలిపారు.

